క్లుప్తంగా

పోలేరమ్మ పల్లకి సేవలో ఎమ్మెల్యే రామిరెడ్డి



అమ్మవారి పల్లకిని మోస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి, ఫౌండేషన్ చైర్మన్ రాజారెడ్డి

అల్లూరు: అల్లూరుపేటలో కొలువైన పోలేరమ్మ తల్లి ఆలయంలో కందల శివరామిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ కందల రాజారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లకి సేవలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆదివారం రాత్రి జరిగిన పల్లకి సేవలో ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్‌రెడ్డి పాల్గొని అమ్మవారి పల్లకిని మోశారు. అమ్మ వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ఫౌండేషన్ సభ్యులు, అమ్మవారి భక్తులు పాల్గొన్నారు.

పీకేపాడు పంచాయతీకి రూ.1.73 లక్షల రాబడి

సోమశిల: అనంతసాగరం మండలం పడమటికంభంపాడు ఎర్ర చెరువులో చేపల పెంపకానికి లీజు వేలం ద్వారా రూ.1.73 లక్షల ఆదాయం వచ్చింది. సోమవారం పంచాయతీ కార్యదర్శి నరేంద్ర, గ్రామ సర్పంచ్ కత్తి లావణ్య అధ్యక్షతన లీజు వేలం నిర్వహించారు. సోమశిలకు చెందిన వల్లం ప్రసాద్ రూ.1.73 లక్షలకు వేలంపాట దక్కించుకున్నారు.

వైభవంగా నాగార్పమ్మ విగ్రహ ప్రతిష్ట



గొల్లపల్లిలో పూజలందుకొంటున్న నాగార్పమ్మ

చేజర్ల: మండలంలోని గొల్లపల్లిలో నాగార్పమ్మ విగ్రహ ప్రతిష్ఠను సోమవారం ఉదయం 9.30 గంటలకు అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రతిష్ఠించారు. వేద మంత్రోచ్చారణలతో హోమాలు, పూజలు నిర్వహించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మ వారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

గుండెపోటుతో ఎల్ఐసీ ఉద్యోగి మృతి



రెడ్డెప్ప (ఫైల్)

ఆత్మకూరు: పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయం ఉద్యోగి రెడ్డెప్ప (54) తీవ్రమైన గుండెపోటుతో ఆదివారం రాత్రి మృతి చెందారు. వైఎస్సార్ జిల్లా కడపకు చెందిన రెడ్డెప్ప 20 ఏళ్లుగా ఆత్మకూరులో ఎల్ఐసీలో ఉద్యోగిగా స్థిరపడ్డారు. ఆదివారం రాత్రి తీవ్ర గుండెపోటుకు గురవ్వడంతో బంధువులు నెల్లూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. రెడ్డెప్ప ఆకస్మిక మృతితో పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని సొంతూరు కడపకు తీసుకెళ్లారు.

నేడు వాహనాలకు బహిరంగ వేలం

చేజర్ల: మద్యం, సారా అక్రమ రవాణా కేసుల్లో పట్టుబడిన వాహనాలకు మంగళవారం వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్సై మరిడినాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు సంగంలోని సెబ్ సర్కిల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వాహన విలువలో 10 శాతం దరావత్తు సొమ్ము చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. పాటదారులు ఆధార్ కార్డు, పాన్ కార్డు తీసుకురావాలన్నారు.

ప్రభుత్వ ప్రాధాన్యతలపై ప్రత్యేక దృష్టి



ఆత్మకూరురూరల్: రెవెన్యూ శాఖలో ప్రభుత్వం ద్వారా వచ్చే మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రాధాన్యతాంశాలను సకాలంలో నెరవేర్చాలని తహసీల్దారు జగదీష్‌బాబు సూచించారు. సోమవారం మండలంలోని వీఆర్‌ఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా భూముల ముటేషన్లు, సర్వేలు, పట్టాదారు పాసుపుస్తకాలు, డీఫారం పట్టాలు జారీ తదితర అంశాలపై ప్రజల నుంచి వచ్చే వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. ఒక్కసారి ఒక సమస్యపై అర్జీ మళ్లీ అదే సమస్యపై రాకుండా వీఆర్‌ఓలు అప్రమత్తంగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు రాజేష్, ఆర్ఐ పృథ్వీకుమార్, సీనియర్ అసిస్టెంట్ కొండయ్య, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష'

• కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే దంపతులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఆదిలక్ష్మి

కావలి: పేదల ఆరోగ్యంపై ప్రభుత్వం బాధ్యతగా ఉండాలనే గొప్ప సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఊరూ వాడల్లో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. కావలి పట్టణంలోని 7, 9 వార్డులకు చెందిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సంచలన ఫలితాల దిశగా దూసుకుపోతుందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యం అందుతుందన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహిస్తున్నారని, పేద ప్రజల గడప ముందుకే వైద్య సేవలు తీసుకువచ్చామన్నారు. మెరుగైన వైద్యం కోసం రిఫరల్ ఆస్పత్రులకు తరలిస్తున్నామని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వంలో చాలీచాలని మౌలిక సదుపాయాలతో నిరుపేదలకు వైద్యం అందేది కాదన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో గవర్నమెంట్ ఆస్పత్రుల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని, మెరుగైన వైద్యం అందరికీ అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి, కుమారుడు బాలసాకేత్ కుమార్‌రెడ్డి, కోడలు మహిమ, మున్సిపల్ కమిషనర్ ఇ.కిరణ్, వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకట నారాయణ, జనిగర్ల మహేంద్ర యాదవ్, తోట శ్రీహరి, కలగయ్య, కుందుర్తి శ్రీనివాసులు, కుందుర్తి కామయ్య, షేక్ షాహుల్, హమీద్, కలికి శ్రీహరిరెడ్డి, పానుగోటి అనురాధ, చేవూరు పద్మ, కలవకూరు ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే లక్ష్యంగా జగన్ పాలన



బుక్‌లెట్‌లు అందజేస్తున్న సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

• మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదల అభ్యున్నతే లక్ష్యంగా సంక్షేమ పాలన అందిస్తున్నారని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆయన సోమవారం మండలంలోని మాసాయిపేట, వీరారెడ్డిపల్లి బీసీ, ఎస్సీ కాలనీల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత లబ్ధిదారులకు అందిన సంక్షేమ పథకాల ప్రజాబావుటా బుక్‌లెట్‌లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా ప్రతి పేద వాడికి సంక్షేమ పథకాలు ఇంటి ముంగిటకు అందిస్తున్న ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ మంజూరుచేయని విధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు ఇంటి నివేశన స్థలాలు, పక్కా గృహాలు మంజూరు చేసి పేదవారి సొంతింటి కలను సాకారం చేస్తున్నారన్నారు. ఆయనను ఆశీర్వదించి రాబోయే ఎన్నికల్లో తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. నియోజకవర్గంలో పార్టీలు, కులాలు, మతాలకతీతంగా అన్ని కుటుంబాలకు ఏదో ఒక రూపేణా లబ్ధి చేకూరిందన్నారు. గడప గడపలో తాను తిరుగుతుంటే ప్రతి మహిళ ముఖంలో చిరునవ్వు కనిపిస్తోందన్నారు. గత ప్రభుత్వ పాలనలో జన్మభూమి కమిటీలు, నాయకులు సిఫారసు చేసిన వారికే సంక్షేమ పథకాలు అందుతుండేవన్నారు. ప్రస్తుత పాలనలో సచివాలయ, వలంటరీ వ్యవస్థ ద్వారా రాజకీయ ప్రమేయం లేకుండా ఎలాంటి సిఫారసులు లేకుండా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఈ తేడాను ప్రజలు గమనించాలన్నారు. ఈ సందర్భంగా ప్రజలు వివిధ సమస్యలు ఆయన దృష్టికి తీసుకురావడంతో వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సానా శ్రీనివాసులురెడ్డి, ఈఓపీఆర్డీ ఎన్.మల్లికార్జున్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జి.ఓబుల్‌రెడ్డి, జెడ్పీ, మండల కోఆప్షన్ సభ్యులు గాజుల తాజుద్దీన్, సుభాని, వైఎస్సార్‌సీపీ నాయకులు జి.శ్రీనివాసులురెడ్డి, ఎల్.వెంకటమ్మ, జి.వెంగళరెడ్డి, ఓబుల్‌రెడ్డి, వీరారెడ్డి, అశోక్, అక్కి భాస్కర్‌రెడ్డి, వి.రమణయ్య, ఎం.లక్ష్మయ్య, రియాజ్, ప్రభాకర్, మురళి తదతరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు రక్ష

రాష్ట్ర ప్రజల సంపూర్ణ ఆరోగ్యం కోసం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు శ్రీరామరక్ష లాంటిదని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. పేదల ఆరోగ్యానికి భద్రత కల్పించాలని, సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజలకు ఆనందాన్ని కలిగించాలనే గొప్ప సంకల్పంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఊరూ వాడా జగనన్న ఆరోగ్య సురక్ష కొనసాగుతోంది.



మర్రిపాడు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న గంగవరపు శ్రీనివాసులునాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొర్రా వెంకట సుబ్బారెడ్డి, చిన్నమాచనూరు సర్పంచ్ కటకం నరసింహారావు, ఎంపీడీఓ నాగమణి, తహసీల్దారు ఆనందరావు, నాయకులు గుంటుపల్లి రమేష్, చెవుల శ్రీనివాసులు తదితరులు



ఆత్మకూరు: జగనన్న సురక్ష ఆరోగ్య కిట్‌లను అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, వైస్ చైర్మన్లు డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, షేక్ సర్దార్, డాక్టర్ షేక్ అస్మా, కౌన్సిలర్లు రమాదేవి, కామాక్షయ్య నాయుడు, కౌసల్యమ్మ, రాజశేఖర్, శివకోటారెడ్డి తదితరులు



కొండాపురం: గొట్టిగుండాలలో కంటి అద్దాలను అందజేస్తున్న వైద్యాధికారులు నసరుద్దీన్, సందీప్, శివప్రసాద్, సురేష్, సర్పంచ్ కొండలరావు, ఎంపీటీసీ వేమిరెడ్డి మల్లికార్జునరెడ్డి, ఎంపీడీఓ బ్రహ్మయ్య తదితరులు



అల్లూరు: ఆరోగ్య సురక్ష కిట్‌ను పంపిణీ చేస్తున్న అల్లూరు పట్టణ అధ్యక్షుడు దండా కృష్ణారెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు నీలం సాయికుమార్, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ శ్రీదేవి, కమిషనర్ ఫణికుమార్ తదితరులు



సోమశిల: జగనన్న ఆరోగ్య సురక్షలో ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, నాయకులు బొద్దుకూరు వెంకటేశ్వరరెడ్డి, నాగ మహేష్‌రెడ్డి, ఎంపీడీఓ ఏ మధుసూదన్‌రావు, వైద్యాధికారులు తదితరులు



చేజర్ల: యనమదలలో జగనన్న ఆరోగ్య సురక్ష బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ విజయలలిత, సర్పంచ్ నోటి సుందరరామిరెడ్డి, ఉప సర్పంచ్ గుడిపాటి ప్రభాకర్‌నాయుడు, కాకివాయి సర్పంచ్ కొమ్మి సుబ్బానాయుడు, నాయకులు నాగ నాగిరెడ్డి, రామసుబ్బారెడ్డి, ఆదిరెడ్డి శేఖర్‌రెడ్డి, రవిరెడ్డి, నోటి గోపాల్‌రెడ్డి, సి.జితేంద్ర తదితరులు

పొగాకు రైతులకు ఎరువుల పంపిణీ



రైతులకు ఎరువులు అందజేస్తున్న వేలం నిర్వహణాధికారి, క్రాఫ్ కమిటీ సభ్యులు

మర్రిపాడు: 2023–24 పంట కాలానికి సంబంధించి ఎరువుల కోసం దరఖాస్తు చేసుకున్న పొగాకు రైతులకు నెల్లూరు డీసీఎంఎస్ ద్వారా సోమవారం ఎరువులు పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా పొగాకు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ మాట్లాడుతూ రెండేళ్ల నుంచి క్రాఫ్ కమిటీ ద్వారా పొగాకు రైతులకు ఎరువులు సరఫరా చేస్తున్నామన్నారు. ఎరువులు బయట మార్కెట్ కన్నా తక్కువ ధరలకు సరైన సమయానికి ఎరువులు అందిస్తున్నట్లు తెలిపారు. పొగాకు పంటకు సీటీఆర్ఐ సిఫారస్సు ప్రకారం ఒక బ్యారెన్‌కు అమ్మోనియం సల్ఫేట్ 11 బస్తాలు, డీఏపీ 4 బస్తాలు, సల్ఫేట్ ఆఫ్ పొటాష్ 7 బస్తాల వంతున సరఫరా చేస్తున్నామన్నారు. రైతులు పొగాకు బోర్డు అనుమతి ఇచ్చిన మేరకే పండించాలని, పంట ఎక్కువైతే డిమాండ్ తగ్గి సరైన ధరలు రావని, రైతులు నష్టపోతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రాఫ్ కమిటీ సభ్యులు ఆరికట్ల జనార్దన్, డీసీఎంఎస్ అధికారి సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందజేత



గర్భిణికి పౌష్టికాహారం కిట్‌ను అందజేస్తున్న సీడీపీఓ వినీల

ఆత్మకూరు: ఆత్మకూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం పోషణ ఆరోగ్య దినం కార్యక్రమం నిర్వహించారు. అర్బన్ హెల్త్ కేంద్రం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పోషక పదార్థాల వల్ల కలిగే ప్రయోజనాలు, వాటిని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉచితంగా గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు అందజేస్తున్న విధానంపై వివరించారు. చిరుధాన్యాలు, రక్తహీనతను నిరోధించే పలు రకాల ఆహార పదార్థాలు, కంటి వెలుగును కాపాడే బొప్పాయి తదితర పోషకాహార పదార్థాల గురించి వివరించారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఉచితంగా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పౌష్టికాహార పదార్థాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పలువురు గర్భిణులకు పౌష్టికాహార కిట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ వినీలత, కమిషనర్ బి నాగేశ్వరరావు, సూపర్‌వైజర్ మోడే రత్నమ్మ, పలు అంగన్‌వాడీల నిర్వాహకులు రాధమ్మ, రమణమ్మ, షకీల, సుప్రజ, భవానీ, సుజన, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ నిధి చట్ట సవరణ రద్దు చేయండి

• న్యాయవాదుల నిరసన



ఆత్మకూరు సివిల్ కోర్టు ఎదుట న్యాయవాదులు నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: న్యాయవాదుల సంక్షేమనిధి చట్టాన్ని ఇటీవల సవరణ చేశారని, దాని వల్ల కక్షిదారులపై ఆర్థిక భారం పడుతుందని, ఈ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని ఆత్మకూరు న్యాయవాదులు కోరారు. ఈ మేరకు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో రాష్ట్ర బార్ అసోసియేషన్ పిలుపు మేరకు సోమవారం నిరసన ప్రదర్శన, అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించారు. పలువురు న్యాయవాదులు కోర్టుల ఎదుట సవరణ చట్టం ప్రకారం ఒక్కో కక్షిదారుడి వద్ద రూ.20 వంతున 'న్యాయవాదుల సంక్షేమ నిధి స్టాంపు' వేయాలని కోరడం సరైన విధానం కాదన్నారు. అనంతరం మాట్లాడుతూ గతంలో రూ.2 మాత్రమే స్టాంపు ఉండగా, ఏకంగా రూ.20 పెంచడం, అదీ ఒక్కో కేసులో ఎందరు కక్షిదారులు ఉంటే అందరూ హాజరైన ప్రతి సారి రూ.20 చొప్పున స్టాంపు చెల్లించాలనడం సరి కాదన్నారు. ఇతర రాష్ట్రాల్లో న్యాయవాదుల సంక్షేమ నిధికి రూ.10 కోట్లు చొప్పున నిధులు అందజేశారని, మన రాష్ట్రంలో అలా ప్రభుత్వం అందజేయకపోగా కక్షిదారులపై భారం మోపడం సరికాదన్నారు. కొన్ని రాష్ట్రాల్లో లాయర్లకు సంక్షేమ నిధి ద్వారా విపత్కర పరిస్థితుల్లో రూ.10 లక్షలు చొప్పున ఆర్థిక సాయం అందజేస్తున్నారని, మన రాష్ట్రంలో అదే విధంగా అమలు చేయాలని కోరారు. ఆచరణ యోగ్యం కాని ఇలాంటి సవరణ చట్టం ద్వారా న్యాయవాదులకు కేసులు సైతం తగ్గే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎల్‌వీ రమణయ్య, సీహెచ్ చెంచయ్య, ఎం.వెంకటేశ్వర్లు, తిరుపతమ్మ, సురేష్, మధు, రహంతున్నీసా, రామ్‌గోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ లీగ్ పోటీలు జయప్రదం చేయండి

ఆత్మకూరు: పట్టణానికి చెందిన అంబేడ్కర్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో 19వ తేదీ నుంచి ప్రారంభమయ్యే నియోజకవర్గ స్థాయి క్రికెట్ లీగ్ పోటీలను జయప్రదం చేయాలని నిర్వాహకులు సోమవారం అన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు, క్రికెట్ టీములు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతి రూ. 20,116, షీల్డ్, ద్వితీయ బహుమతిగా రూ. 15,116, షీల్డ్ అందజేయనున్నట్లు వివరించారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించే ఈ పోటీల్లో పాల్గొనే టీమ్ రూ.700 ఎంట్రీ ఫీజు చెల్లించాలన్నారు. 96768 44849, 99633 20415 నంబర్లలో సంప్రదించాలన్నారు.

సెలవులను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులతో కథలు చెప్పిస్తున్న దృశ్యం

సంగం: దసరా సెలవుల నేపథ్యంలో చిన్నారులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ రవీంద్రరెడ్డి అన్నారు. సోమవారం పిల్లలను గ్రంథాలయాలకు పిలిపించి పిల్లలకు కథలు చెప్పించడం, వినిపించడం చేశారు. రామాయణ, భారత భాగవతాలను వివరించారు. స్పోకెన్ ఇంగ్లిష్ నేర్చుకోవాలని సూచించారు.

జగనన్నకు చెబుదాంలో వినతుల స్వీకరణ

సంగం: సంగం ఎంపీడీఓ కార్యాలయంలో తహసీల్దారు నాగరాజు, ఎంపీడీఓ గోపి ఆధ్వర్యంలో సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరయ్యారు. ప్రజల వద్ద నుంచి అర్జీలు స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఏఓ శ్రీహరి, ఇరిగేషన్ ఏఈ కృష్ణ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

• వరికుంటపాడు: ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓ చేవూరి శ్రీదేవి జగనన్నకు చెబుదాం నిర్వహించారు. పలువురి నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరుకాకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సర్వభూతేషు. శక్తి రూపేణ

దేవీ శరన్నవరాత్రి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం అమ్మవారి ఆలయాల్లో కొలువైన దేవీ వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. జగజ్జననీ.. సర్వభూతేషు.. శక్తి రూపేణ.. అంటూ భక్తులు ప్రణమిల్లి ప్రార్థించారు.



ఆత్మకూరు: అన్నపూర్ణ అలంకారంలో కన్యకాపరమేశ్వరి



సోమశిల: గాయత్రీదేవి అలంకారంలో కామాక్షమ్మ



సంగం: సంగమేశ్వరస్వామి ఆలయంలో గాయత్రీదేవిగా కామాక్షితాయి



ఉదయగిరి: గాయత్రీదేవిగా పార్వతీదేవి



కలిగిరి: తెల్లపాడులో గాయత్రీదేవిగా భద్రకాళి



వరికుంటపాడు: బ్రహ్మచారిణిగా మానసాదేవి



వరికుంటపాడు: అన్నపూర్ణదేవిగా నాగారపమ్మ

బాల్య వివాహాలు అరికడదాం



పట్టణంలోని దళితకాలనీలో బాల్య వివాహాలు జరగకుండా చూస్తామని కాలనీ వాసులతో ప్రమాణం చేస్తున్న మెప్మా అధికారులు

ఆత్మకూరు: బాలికలకు అనారోగ్యాలు సంక్రమించడంతో పాటు ఆర్థికంగా, మానసికంగా ఎదుగుదలను కోల్పోయే బాల్య వివాహాలను ప్రతి ఒక్కరూ బాధ్యతతో అరికట్టాలని మెప్మా సిబ్బంది కోరారు. ఆత్మకూరు మెప్మా సీఎంఎం అంకయ్య, సీఓ మాధవి ఆధ్వర్యంలో బాల్య వివాహ నిషేధ చట్టంపై పట్టణంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తొలుత మెప్మా కార్యాలయంలో సభ్యులతో బాల్య వివాహాన్ని అరికడతామని ప్రమాణాలు చేయించారు. అనంతరం పట్టణంలోని దళితకాలనీల్లో బాల్య వివాహాలతో జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. పొదుపు గ్రూపు సభ్యులు తమ పరిధిలో బాల్య వివాహాలు జరగనీయకుండా ఉన్నతాధికారులకు తెలపాలని కోరారు. కార్యక్రమంలో టీఎల్ఎఫ్, ఎస్ఎల్ఎఫ్, ఆర్పీలు సుభాషిణి, సుష్మ, పొదుపు గ్రూపు లీడర్లు, తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

బిట్రగుంట: బోగోలు ప్రధాన కూడలిలోని 144వ నంబరు రైల్వే లెవల్ క్రాసింగ్ గేటు సమీపంలో జనశతాబ్ది సూపర్‌ఫాస్ట్ రైలు ఢీకొని బోగోలు పంచాయతీ అరవపాళెంకు చెందిన ఆంథోని (55) మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, రైల్వే పోలీసుల కథనం మేరకు బిట్రగుంట రన్నింగ్ రూం క్యాంటీన్‌లో కాంట్రాక్ట్ కార్మికుడిగా విధులు నిర్వహించే ఆంథోని సాయంత్రం సమయంలో విధులు ముగించిన రైల్వే గేటు దాటి బోగోలు బజార్‌కు వస్తుండగా విజయవాడ నుంచి చెన్నై వెళుతున్న జనశతాబ్ది రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆంథోని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి వినికిడి సమస్య ఉండడంతో రైలు వస్తున్న విషయం గుర్తించలేకపోయినట్లు స్థానికులు తెలిపారు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సచివాలయాన్ని తనిఖీ చేసిన తహసీల్దారు



రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దారు నాగరాజు

సంగం: సంగంలోని స్థానిక 1, 2 సచివాలయాలను సోమవారం తహసీల్దారు నాగరాజు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. సచివాలయంలోని రికార్డులు పరిశీలించి సంక్షేమ పథకాల అమలు తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది హాజరును పరిశీలించారు. సిబ్బంది తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని సూచించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.